

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌యాదవ్ తదితరులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రాంనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల ఇంజనీరింగ్ కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ. రాజేశ్వర్‌యాదవ్ ఆరోపించారు. బీసీ గ్రాడ్యుయేట్లు, డిగ్రీ విద్యార్థులకు జీఆర్‌ఈ, ఐఎల్‌ఈటీఎస్, బ్యాంకింగ్ కోసం ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్ రూ. 15,000 కోట్లకు పెంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ కోర్సుల స్కాలర్‌షిప్ రూ. 5 వేల నుంచి 25 వేలకు పెంచాలన్నారు. గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో ఎ. రాజేశ్వర్‌యాదవ్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.



డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయండి : ఎమ్మెల్యే

నల్లకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం నల్లకుంట డివిజన్‌లో బాయమ్మగల్లీ, బ్రాహ్మణ హాస్టల్ వీధిలో పాదయాత్ర చేశారు. డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. జలమండలి ఏఈ రోహిత్, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

నల్లకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురనగర్‌కాలనీలో 15 రోజులుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పైపులైన్ పగిలిపోయిన ప్రాంతానికి గురువారం జలమండలి అధికారులు, సిబ్బందిని పిలిపించి మరమ్మతులు చేయించారు. బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, కాలనీ అధ్యక్షుడు ఎం. సురేందర్ ముదిరాజ్, నాయకులు జమ్మిచెట్టి బాలరాజు, కాశం శ్రీహరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్రంలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య గురువారం వినతిపత్రం అందజేశారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షుడు తాలుక రాజేష్, నగర అధ్యక్షుడు బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జి.కల్యాణ్, ప్రధాన కార్యదర్శి కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

డ్రైనేజీ సమస్య పరిష్కారంపై హర్షం

ముషీరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ చౌరస్తా నుంచి సెయింట్ పాయిస్ స్కూల్ రోడ్డులో దశాబ్ద కాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంపై వర్తక సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వర్తక సంఘం సీనియర్ నాయకులు నాళ్ల అనిల్‌కుమార్, పేపూర్ రాజ్‌కుమార్, బచ్చు రాజ్‌కుమార్, భూంపల్లి రవిచారి మాట్లాడారు. సమస్యను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లడంతో పైపులైన్ పనులకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

డాక్టర్ ఇంట్లో ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు.. 57 స్వాధీనం

రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నార్కోటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్ఓటీ, పోలీసులు గురువారం ఆసిఫ్‌నగర్‌లో ఓ ఇంటిపై దాడి చేసి అధిక మత్తునిచ్చే 57 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌లో నివసిస్తున్న డాక్టర్ ఆశన్ ముస్తఫా ఖాన్ ఓ ఆస్పత్రిలో అనస్థీషియన్. సర్జరీల సందర్భంగా మత్తు కోసం ఇచ్చే ఫెంటానిల్ ఇంజక్షన్‌లను మార్కెట్‌లో రూ. 17,500కు విక్రయిస్తున్నాడు. ఇవి హెరాయిన్ కంటే 50 శాతం ఎక్కువ, మార్ఫిన్ కంటే మరింత ఎక్కువ ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. యాప్ ద్వారా డాక్టర్ ఆశన్ ముస్తాఫా ఖాన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నిఘా పెట్టారు. గురువారం అతడి ఇంటిపై దాడి చేయగా డాక్టర్ కువైట్ పారిపోయినట్లు గుర్తించారు. అతడి భార్య లుబ్నా నజీబ్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 57 మత్తు ఇంజక్షన్లు, రెండు సెల్‌ఫోన్‌లు, ఆరు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేని తహసీల్దార్ పేరుతో కుల ధ్రువీకరణ పత్రం

- డబుల్ బెడ్‌రూం కోసం ఫోర్జరీ చేసిన మహిళ

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం కోసం ఓ మహిళ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందినట్లు బహదూర్‌పురా మండల కార్యాలయ అధికారులు గుర్తించారు. లేని తహసీల్దార్ పేరుతో ధ్రువీకరణ పత్రం జారీ కావడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. దివాన్‌దేవిడి ప్రాంతానికి చెందిన శేఖర్ భార్య మంజుల(36)కు అబ్దుల్లాపూర్‌మెట్‌లో డబుల్ బెడ్‌రూం మంజూరైంది. 2023 అక్టోబర్ 13న ఎస్సీ మాదిగ కులానికి చెందినట్లుగా కుల ధ్రువీకరణ పత్రం పొందింది. ఇల్లు అప్పగించేందుకు బల్దియా అధికారులు పత్రంలోని తప్పులను సరిదిద్ది కొత్తది కావాలని సూచించారు. సదరు మహిళ అప్పటికే తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకుంది. గురువారం దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ చంద్రశేఖర్ జారీ చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ పేరు జానకిగా ఉంది. జానకి పేరుతో తహసీల్దార్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాన్ని ఎలా పొందావని మహిళను అధికారులు ప్రశ్నించారు. తన భర్త తీసుకొచ్చాడని, నూర్‌ఖాన్ బజార్‌లో ఓ మీ-సేవ సెంటర్ నిర్వాహకులు ఇప్పించారని చెప్పింది. తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్ని ఫోర్జరీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి, మీ-సేవ సెంటర్ నిర్వాహకుడి పాత్ర ఏంటి అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలుతుందని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు.

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యురాలిగా వరలక్ష్మి



బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యురాలుగా నగరానికి చెందిన ఎస్.వరలక్ష్మి నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అజయ్‌కుమార్ సింగ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించడంలో తాను చేసిన కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ బోర్డు సభ్యురాలిగా నియమించిందని తెలిపారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బలోపేతం, రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

షేర్ అలీ వీధిలో.. రోడ్డు అధ్వానం

- నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ప్రజల ఇబ్బంది



అధ్వానంగా ఉన్న రోడ్డు

ముషీరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): షేర్ అలీ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. షేర్ అలీ వీధిలో రోడ్డు నిర్మాణానికి గత ఏడాది నిధులు మంజూరయ్యాయి. ఏడు నెలల క్రితం డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో గల్లీలో రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. ప్యాచ్‌వర్క్ పనులు కూడా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మించాలని ముఠాగోపాల్ ఆదేశించినా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు.

ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. షేర్ అలీ వీధి గల్లీలన్నీ చిన్నవిగా ఉండడం వల్ల (వెడల్పు లేకపోవడం వల్ల) పనులు చేపట్టేందుకు ఇబ్బందిగా ఉంటుందని కాంట్రాక్టర్లు రావడం లేదని అధికారులు అంటున్నారు.

తవ్వి వదిలేశారు



ఏడు నెలల క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలి.

- ప్రభు, స్థానికుడు

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి



పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా రోడ్డు వేయడం లేదు. రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సంతోష్, స్థానికుడు

ఎన్టీఆర్‌కు నివాళి

రాంనగర్/నల్లకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పార్టీ నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నాడు తెలంగాణలో పటేల్ పట్వారి వ్యవస్థను రూపుమాపిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



టీడీపీ నగర కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పి.సాయిబాబా తదితరులు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ తదితరులు



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్ తదితరులు



చిక్కడపల్లిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న పారిశుధ్య కార్మికులు



ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నైషధం సత్యనారాయణమూర్తి తదితరులు

అద్దంకి దయాకర్‌కు అన్యాయంపై నిరసన

కవాడిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా దయాకర్‌ను ఎంపికచేయకపోవడాన్ని నిరసిస్తూ గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు నేతలు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. దయాకర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వారిని అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఆందోళన కారులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అరెస్ట్ చేసిన వారిని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సుధాకర్ మాట్లాడుతూ.. దయాకర్ రాజకీయ ఎదుగుదలను అడ్డుకునే వారి పేర్లు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ నామినేషన్ వేయమని చెప్పి చివరి నిమిషంలో ఆయన పేరు మార్చడం మాలలను అవమానించడమేనని ఆరోపించారు. ఆయనకు సముచిత స్థానం కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్యం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కార్యదర్శి రవికాంత్, కరణ్ అనుపాల్, రాజేష్, రవికుమార్, ప్రభాకర్, నరహరి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, నేతలు

ఆలయాలు పరిశుభ్రం

కవాడిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరంలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కార్పొరేటర్ జి. రచనశ్రీ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయాలు, పరిసరాలను పరిశుభ్రం చేయాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గురువారం కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మ దేవాలయంలో విజయ గణపతి ఓంకారేశ్వర దేవాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు, సెన్సార్‌బోర్డ్ కమిటీ సభ్యులు గంట శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, నగర కార్యవర్గసభ్యుడు భువనగిరి చంద్రశేఖర్‌తో కలిసి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈనెల 22న ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యుడు భువనగిరి నవీన్ పాల్గొన్నారు.

నల్లకుంట: అంబర్‌పేటలో మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం శుభ్రం చేశారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు ఎడెల్లి అజయ్‌కుమార్, పెంటం రాజు, చుక్క జగన్, పి.గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

గోల్నాక: జైస్వాల్ గార్డెన్‌లో మైసమ్మ ఆలయం, పరిసరాలను జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పరిశుభ్రం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్. రమేష్‌గౌడ్, చైర్మన్ జి. ప్రసన్నాంజనేయులు, ప్రధాన కార్యదర్శి సి. యాదవరెడ్డి, వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఓంకారేశ్వర ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు



అంబర్‌పేటలో మహంకాళి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, బీజేపీ నాయకులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

చిక్కడపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సౌజన్యంతో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నటసార్వభౌమ ఎన్టీరామారావు వర్ధంతి, మిస్సమ్మ సినిమా విడుదలై 69 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ సాలూరి వాసూరావుకు దర్శక రాజస్వర సార్వభౌమ అవార్డును దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డా. పాలకుర్తి మధుసూదనరావు ప్రదానం చేసి సన్మానించారు. తొలుత సంగీత విభావరి నిర్వహించారు. నిర్వాహక సంస్థ అధ్యక్షుడు చంద్రతేజ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విశ్రాంత న్యాయాధికారి బి. మధుసూదన్, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, మహ్మద్ రఫీ, లోకం కృష్ణయ్య, వీకే దుర్గ, ఎం శివకుమార్, రమణాచారి పాల్గొన్నారు

నేడు గిరిజన సంస్కృతి పరిరక్షణపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నాంపల్లి తెలుగు వర్సిటీ సమావేశ మందిరంలో 'జానపద, గిరిజన కళలు, సంస్కృతి-అధ్యయనం-పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. సదస్సులో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

మత్స్య సొసైటీలో ఇతర కులాలకు సభ్యత్వాలివ్వొద్దు

నల్లకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మత్స్య సొసైటీలో ఇతర కులాలకు సభ్యత్వాలు ఇవ్వొద్దని, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో ఐఏఎస్ అధికారిని నియమించి మత్స్య శాఖను ప్రక్షాళన చేయాలని గంగపుత్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కే ప్రసాద్ డిమాండ్ చేశారు. హైదర్‌గూడలో ఎన్ఎస్ఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్‌లోని 4 వేల చెరువులు అన్యాక్రాంతం కావడంతో గంగపుత్రులు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న ఇందిరాపార్కు వద్ద గంగపుత్రుల గోస కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గంగపుత్ర మహాసభ రాష్ట్ర సలహాదారులు దీటి రాంచందర్, పొలిటికల్ ఇన్‌చార్జి సింగారం రవీందర్, నగర ఉపాధ్యక్షుడు పూస రాజ్‌కుమార్, కార్యదర్శులు దయానంద్, ఎ.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

21న ముగ్గుల పోటీలు

చిక్కడపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని అధ్యక్షురాలు బోనం ఊర్మిళ తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్‌లో మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. ఈనెల 21న ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. పోటీలో పాల్గొనాలనే ఆసక్తిగల మహిళలు 7989438283 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

'ఐఐటీ, నీట్ ఉచిత తరగతుల నిర్వహణ అభినందనీయం'

- ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మెటా మైండ్ అకాడమీ ఆధ్వర్యంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌పై ఉచిత అవగాహన తరగతులు నిర్వహించడం అభినందనీయమని టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఈ మేరకు మెటా మైండ్ అకాడమీ చైర్మన్ మనోజ్‌కుమార్, డైరెక్టర్ గోపాల్‌తో కలిసి గురువారం ఐఐటీ, నీట్ ఉచిత అవగాహన తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఐఐటీయన్స్, మెడికోలతో విద్యార్థులకు తరగతులు నిర్వహించడం ద్వారా ప్రవేశ పరీక్షలపై అవగాహన ఏర్పడుతోందన్నారు. మెటా మైండ్ చైర్మన్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, పోటీ పరీక్షలను ఎదుర్కొని మొదటి ప్రయత్నంలోనే సీట్లను సాధించే విధానంపై తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దోమలగూడలో మెటామైండ్ అకాడమీలో ప్రతి ఆదివారం తరగతులుంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9090898902, 9090898928 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ కార్యవర్గం

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్‌కు 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. చైర్మన్‌గా లక్ష్మీనారాయణ గుప్తా గమిని, వైస్ చైర్మన్‌గా మంజత్‌బుచా, కార్యదర్శిగా శిల్పా బంగ్, కోశాధికారిగా పవన్ కంకణి, సభ్యులుగా తంగిరాల లలితాదేవి, అక్షితా సురానా, ఏ.కార్తీక్, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా రాజవేలు వెంకటరమణ, మహాదేవి తిరునగరి ఎన్నికైనట్లు చాప్టర్ ఈవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ కాలపరిమితి 2025 జనవరి 18 వరకు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన మహమ్మద్ షరీఫ్(35) భార్య, కుమార్తెతో కలిసి పాతబస్తీ శాలిబండలో నివసిస్తూ శుభకార్యాలలో మటన్ కట్ చేస్తూ జీవిస్తున్నాడు. ఐదు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న షరీఫ్ ఇంటి అద్దె కట్టలేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం శివరాంపల్లి-ఫలక్‌నూమా రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమను నిరాకరించిందని బాలికపై దాడి

- అడ్డుకోబోయిన సోదరికి గాయాలు

అంబర్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో బాలికపై దాడిచేశాడు ఓ బాలుడు. బాగ్‌అంబర్‌పేటకు చెందిన బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. అతడు కొంతకాలంగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో బాలిక ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడడానికి ప్రయత్నించగా నిరాకరించింది. కోపోద్రిక్తుడైన బాలుడు కూరగాయలు కోసే కత్తితో బాలికపై దాడి చేశాడు. బాలిక సోదరి అడ్డుకోబోగా ఆమె పొట్టలో పొడిచాడు. గాయపడిన ఇద్దరు బాలికలను స్థానికులు ఆంధ్రమహిళా సభ ఆస్పత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ సందర్శించారు. బాలుడిపై హత్యాయత్నం, పోక్సో కేసు నమోదు చేశారు.